క్లుప్తంగా

వినాయక ఉత్సవాల్లో డీజేలు నిషేధం



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ కామేశ్వరరావు

పెదగంట్యాడ: వినాయక చవితి ఉత్సవాల్లో భారీ శబ్దంతో కూడిన డీజే సౌండ్‌కు అనుమతి లేదని న్యూ పోర్టు పోలీస్ స్టేషన్ సీఐ కామేశ్వరరావు స్పష్టం చేశారు. పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం వినాయక ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక ఉత్సవాల్లో, ఊరేగింపులో డీజే సౌండ్‌కు అనుమతి లేదని నిబంధనలను ఉల్లంఘించిన మండపాలపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వినాయక ఉత్సవాలు శాంతియుత వాతావరణంలో జరిగేలా చూసుకోవాల్సిన బాధ్యత నిర్వాహకులదేనని తెలిపారు. ఎస్ఐ శ్యామ్‌సుందర్ తదితరులు పాల్గొన్నారు.

మానవతా సభ్యుల శాంతి ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న మానవతా సంస్థ సభ్యులు


గాజువాక: మానవతా స్వచ్ఛంద సంస్థ ఆవిర్భావ దినం సందర్భంగా ఆ సంస్థ సభ్యులు గాజువాకలో శుక్రవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గాజువాక సీఐ పార్థసారథి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మానవతా స్వచ్ఛంద సంస్థ సభ్యుల సేవలు చిరస్మరణీయమన్నారు. అనాథ మృతదేహాలను తరలించడం, మృతదేహాలకు ఉచితంగా ఫ్రీజర్లను ఇవ్వడం, దహన సంస్కారాలు నిర్వహించడం వంటి సేవలు ఎంతో గొప్పవని అన్నారు. కార్యక్రమంలో మానవతా సంస్థ జిల్లా అధ్యక్షుడు దీనకొండ కృష్ణంరాజు, స్థానిక నాయకులు కరణంరెడ్డి నర్సింగరావు, బాటా శ్రీను, పొలిమేర శ్రీను, వి.ఆర్.కె.రాజు, శ్రీనివాసరావు, ఎం.వి.సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు కూటమి మద్దతు

- స్టీల్ గుర్తింపు యూనియన్‌నేతల ఆరోపణ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా చేసి సెయిల్‌లో విలీనం చేసేలా కృషి చేస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం.. ఇప్పుడు స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు సంపూర్ణ మద్దతు ఇస్తుందని స్టీల్‌ప్లాంట్ గుర్తింపు యూనియన్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కె.ఎస్.ఎన్. రావు, డి.ఆదినారాయణ ఆరోపించారు. శుక్రవారం గుర్తింపు యూనియన్ నాయకులతో సమావేశంలో వారు మాట్లాడారు. ఇప్పటికే స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం 34 విభాగాలకు టీఎంసీ కోసం ఈవోఐలు ఆహ్వానిస్తూ నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. అయినా దీనిపై కూటమి పాలకులు స్పందించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికే 4 వేల మందిని ఎలాంటి కారణం లేకుండా తొలగించారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మరింత వేగం పెంచి కార్మికులపై కేంద్ర ప్రభుత్వం పూర్తిగా నిర్బంధాన్ని ప్రయోగిస్తుందన్నారు. నిరాహార దీక్ష చేసుకోవడానికి కూడా అనుమతించక పోవడం దారుణమన్నారు. వీటన్నిటికీ కూటమి ప్రభుత్వం సహకరించిందని మండిపడ్డారు. కూటమి నాయకులు ఇప్పటికైనా రాజకీయ విమర్శలను పక్కన పెట్టి... కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఉత్తర్వులు ఉపసంహరించుకునేలా చేసి సెయిల్‌లో విలీనం చేయడానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు.

రోగులకు పండ్లు పంపిణీ



రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ పద్మజ, తదితరులు

అగనంపూడి: పద్మవిభూషణ్, మెగాస్టార్ చిరంజీవి జన్మదినోత్సవం సందర్భంగా అగనంపూడిలో అభిమానుల సంఘం పలు సేవా కార్యక్రమాలు చేపట్టింది. పెదమడక పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి పిల్లలకు మిఠాయిలు పంచిపెట్టారు. తర్వాత అగనంపూడి ఏరియా ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గోపీకృష్ణ, డాక్టర్ కణితి పద్మజ, డాక్టర్ ప్రమీల, అభిమానుల సంఘ ప్రతినిధులు విందల చిరురాజు, కొలిపాక అప్పారావు, ఎం.మురళీ, రమణ తదితరులు పాల్గొన్నారు.



రోడ్ల పై తినుబండారాలు



ఫాస్ట్ ఫుడ్.. బీ కేర్‌ఫుల్

నిబంధనలు పాటించని వ్యాపారులు

ఫాస్ట్ ఫుడ్.. ఆరోగ్యానికి భద్రమేనా..! బలమైన ఆహారమేనా.. విచ్చలవిడిగా విక్రయిస్తున్న ఆహారంలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నారా.. పౌష్టికాహారాన్ని అందిస్తున్నారా.. అంటే కాదనే సమాధానాలే వినిపిస్తున్నాయి.. దీనికి కారణం ఫుడ్ సేఫ్టీ అధికారుల నిర్లక్ష్యమేనని తెలుస్తోంది..అధికారులు సక్రమంగా తనిఖీలు చేయకపోవడంతో వ్యాపారులు నచ్చినట్టు వండుతున్నారు. దీంతో ఫాస్ట్ ఫుడ్ తినే వారి ఆరోగ్యం కూడా అంతేవేగంగా పాడవుతోంది.

–పెదగంట్యాడ

ఫుడ్ బిజినెస్ చేయాలంటే **లైసెన్సు తప్పకుండా ఉం**డాలి. కానీ మండలంలోని **లైసెన్సు లేని ఫాస్ట్ ఫుడ్** సెంటర్లు కుప్పలు తెప్ప**లుగా కనిపిస్తున్నాయి.** ఆహార పదార్థాలు తయారు **చేసి, విక్రయించే వారు** నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదు.. ఆహారం తయారీ తేదీ.. ఎంత కాలంలో వినియోగించాలనే అనే విషయాలను కూడా ముద్రించకుండా ఇష్టారాజ్యంగా వ్యాపారాలు చేస్తున్నారు. ఆహార పదార్థాలు, విక్రయాలకు సంబంధించి ఆహార ప్రమాణాల సంస్థ నుంచి తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలి. ఫాస్ట్ ఫుడ్ స్టాళ్లు, కర్రీ పాయింట్లు, బిర్యానీ పాయింట్లు, కూల్‌డ్రింక్స్, చికెన్ సెంటర్లు, చేపలు, రొయ్యలతో పాటు బేకరీలు నిర్వహించే వారు అనుమతులు పొందాల్సి ఉంది. అయితే మండలంలో ఆయా వ్యాపారులు నిబంధనలు పాటించడం లేదు. రిజిస్ట్రేషన్‌తో కొందరే వ్యాపారాలు చేస్తుండగా మరికొందరు అసలు రిజిస్ట్రేషన్ లేకుండా వ్యాపారాలు సాగిస్తున్నారు. చాలా మంది వ్యాపారాలకు అనుమతులు తీసుకోవాలనే విషయమే తెలియకపోవడం గమనార్హం. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడడంతో పాటు ప్రజల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది.



కంటికి ఇంపుగా రంగులతో కావాపుల్లలు..

కానరాని తనిఖీలు

మండలంలో ఆహార పదార్థాలు విక్రయించే స్టాళ్లు అనేకం ఉన్నాయి. ఆయా స్టాళ్లలో విక్రయించే ఆహారం ఎంతవరకు నాణ్యతతో కూడుకుని ఉందో తెలియడం లేదు. తనిఖీలు చేయాల్సిన అధికారులు ఎవరూ కానరాకపోవడంతో వ్యాపారులు నచ్చినట్టు వ్యాపారాలు చేస్తున్నారు.



పలుమార్లు మరిగిన నూనె



నాసిరకం నూనెతో వంటకాలు

కంటికి ఇంపుగా..



రోడ్డు పక్కన నిర్వహించే ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలోని వంటకాలు నిగనిగలాడుతూ కంటికి ఇంపుగా కనిపిస్తాయి. వాటిని చూడగానే లొట్టలేసుకుని తింటాం. తర్వాత అనారోగ్య సమస్యలతో బాధపడుతుంటాం. వ్యాపారులు నాణ్యమైన ఆహారాన్ని విక్రయించేలా ఫుడ్ సేఫ్టీ అధికారులు చర్యలు చేపట్టాలి.

– బొడ్డు సురేష్, పెదగంట్యాడ

కల్తీతో అనారోగ్యం



కల్తీ ఆహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతుంది. నాసిరకం నూనెతో తయారు చేసిన వంటకాలు తింటే పలు వ్యాధులకు లోనయ్యే ప్రమాదం ఉంది. చిన్న పిల్లలకు అలర్జీ వచ్చే అవకాశం ఉంది. వంటల్లో మంచి నూనెను... అది కూడా ఒకసారి మాత్రమే వినియోగించాలి.

–డాక్టర్ ప్రదీప్ ప్రసాద్ రాజా, వైద్యాధికారి, దేవాడ పీహెచ్‌సీ

మండలంలోని పెదగంట్యాడ జంక్షన్, అరుణా థియేటర్ కూడలి, వుడా కాలనీ జంక్షన్, సీతానగరం జంక్షన్, సిద్ధేశ్వరం జంక్షన్, నమ్మిదొడ్డి జంక్షన్, మదీనా బాగ్ జంక్షన్లు, హౌసింగ్ బోర్డు కాలనీ ఏరియాతో పాటు మద్యం దుకాణాలు ఉన్న ప్రాంతాల్లో ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు ఎక్కువగా కనిపిస్తున్నాయి. అయితే ఈ సెంటర్లలో అధికంగా నాణ్యత లేని, రంగులతో కూడిన వెజ్–నాన్ వెజ్ పదార్థాలు విక్రయిస్తున్నారు. ఇప్పటికైనా ఫుడ్ సేఫ్టీ అధికారులు స్పందించి నాణ్యత ప్రమాణాలు పాటించని వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు..

నాసిరకం నూనెతో..

ఒకసారి వాడిని వంట నూనెను మరుసటి రోజు వినియోగించకూడదు. అయితే అధికారులు పట్టించుకోకపోవడంతో వ్యాపారులు వాడిన నూనెనే మళ్లీ మళ్లీ వాడుతున్నారు. ప్రజారోగ్యంతో చెలగాటుమాడుతున్నారు.

దువ్వాడ రైల్వే సమస్యలపై జీఎంకు వినతి



జీఎం సందీప్ మాథ్యుర్‌కు వినతిపత్రం అందిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్‌లో దీర్ఘకాలంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని దక్షిణ కోస్తా రైల్వేజోన్ జనరల్ మేనేజర్ సందీప్ మాథ్యూర్‌ను దువ్వాడ రైల్వేస్టేషన్ యూజర్స్ ప్రతినిధులు కలిసి కోరారు. జీఎం కార్యాలయంలో శుక్రవారం కలిసిన నాయకులు ప్రధాన సమస్యలపై వినతిపత్రం అందజేశారు. విశాఖ– నర్సాపురం మధ్య గతంలో కొనసాగిన రైలును పునరుద్ధరించాలని, వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌కు దువ్వాడలో హాల్ట్ ఇవ్వాలని, దువ్వాడ రైల్వేస్టేషన్‌లో కోచ్ మెయింటినెన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. తరువాత సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్‌ను కలిసి ద్విచక్ర వాహనాలు, నాలుగు చక్రాల వాహనాలకు పార్కింగ్ ఫీజు తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో తూర్పు కోస్తా రైల్వే జోనల్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడు కంచుమూర్తి ఈశ్వర్, దువ్వాడ రైల్వేస్టేషన్ యూజర్స్ అసోసియేషన్ సలహాదారు ఎంఎస్ఎన్‌మూర్తి, అధ్యక్షుడు జాషువా, ఉపాధ్యక్షుడు బి.కామేశ్వరరావు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 1 నుంచి గురజాడ కళాక్షేత్రం ఆన్‌లైన్ బుకింగ్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లోని గురజాడ కళాక్షేత్రం బుకింగ్ సెప్టెంబర్ 1 నుంచి ప్రారంభించనున్నారు. ఇప్పటి వరకు ఉద్యోగులు తమ కుటుంబ సభ్యుల శుభకార్యాల కోసం టౌన్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ద్వారా ఆఫ్‌లైన్‌లో బుకింగ్ చేసుకునేవారు. ఇటీవల యాజమాన్యం తీసుకున్న నిర్ణయం మేరకు ఆన్‌లైన్ బుకింగ్ ప్రారంభిస్తున్నారు. ఉద్యోగులు ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకుంటే వారికి బుకింగ్ సమాచారం ఈ–మెయిల్ ద్వారా అందజేస్తారు. పేమెంట్ కోసం ప్రస్తుతం ఉన్న చలానా పద్ధతి కొనసాగిస్తామని టౌన్ అడ్మినిస్ట్రేషన్ విభాగం అధికారులు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

గాజువాకలో 'సుందరకాండ'



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సినీ నటులు

గాజువాక /అగనంపూడి : గాజువాకలో ఏర్పాటు చేస్తున్న సుందర వస్త్ర మహాగణపతి విగ్రహం వద్ద 'సుందరకాండ' సినిమా బృందం సందడి చేసింది. ఈ సందర్భంగా హీరో నారా రోహిత్, హీరోయిన్లు వ్రితి వాఘని, శ్రీదేవిలు కలిసి సుందర మహాగణపతి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రోహిత్ మాట్లాడుతూ లక్ష చీరలతో గణపతి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు గంటా రవి, చట్టి గోపీ, చింతపల్లి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

'సుందరకాండ' ప్రమోషన్స్

'సుందరకాండ' సినిమా ప్రమోషన్లలో భాగంగా చిత్ర బృందం కాపు జగ్గరాజుపేటలోని మహిళా విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలను సందర్శించింది. ఈ నెల 27న విడుదల కానున్న ఈ సినిమా గురించి విద్యార్థులతో ముచ్చటించారు. సినిమా విశేషాలు తెలుసుకున్న విద్యార్థులు హీరో హీరోయిన్లతో సెల్ఫీలు దిగి సందడి చేశారు. ఈ కార్యక్రమంలో చిత్ర నిర్మాత సంతోష్ చిన్నపోళ్ల పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

గాజువాక: సీజనల్ వ్యాధులపై జీవీఎంసీ గాజువాక జోనల్ ప్రజారోగ్య విభాగం సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. భాస్కర్ విద్యానికేతన్ విద్యార్థులతో కలిసి నిర్వహించిన ర్యాలీ 70వ వార్డులోని చట్టివానిపాలెం పరిసర ప్రాంతాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా ప్రజారోగ్య విభాగం శానిటరీ సూపర్‌వైజర్ కోటేశ్వరరావు మాట్లాడుతూ దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. దోమలను నివారించుకుంటే డెంగ్యూ, మలేరియా నుంచి దూరంగా ఉండవచ్చన్నారు. ఇళ్ల పరిసరాల్లో పాడైపోయిన టైర్లు, పూల కుండీలు, కొబ్బరి చిప్పలు, రిఫ్రిజిరేటర్ల వెనుకభాగంలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని కోరారు. ఇళ్ల కిటికీలకు మెస్‌లు, ఇంట్లో దోమ తెరలను వాడాలని, పిల్లలకు నిండుగా ఉండే దుస్తులను ఉపయోగించాలని సూచించారు. కార్యక్రమంలో వార్డు శానిటరీ సిబ్బంది మూర్తి, రమాదేవి, చిన్నంనాయుడు, భాస్కర్, అప్పలనాయుడు, మలేరియా ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శ్రావణలక్ష్మీ నమోస్తుతే..



ఉక్కు త్రిశక్తి ఆలయంలో కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు



విశేష అలంకరణలో మహాలక్ష్మి అమ్మవారు

ఘనంగా ఆఖరి శ్రావణ శుక్రవారం పూజలు

ఉక్కునగరం: శ్రావణ మాస ఆఖరి శుక్రవారం పూజలు ఘనంగా నిర్వహించారు. పలు ఆలయాల్లో సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శ్రావణ లక్ష్మికి విశేష పూజలు చేశారు.

– స్థానిక త్రిశక్తి దేవాలయంలో అమ్మవార్లకు ఉదయం సామూహిక కుంకుమార్చన చేశారు. ఆలయ ప్రధానార్చకులు ఫణిశర్మ నేతృత్వంలో మహాలక్ష్మి, మహాదుర్గ, మహాసరస్వతి అమ్మవార్లకు వేకువజామున ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. సాయంత్రం మహాలక్ష్మి అమ్మవారికి సహస్ర కమల పుష్పార్చన చేశారు. అనంతరం నక్షత్ర హారతులు, నీరాజన మంత్రపుష్పం సమర్పించారు. ఉక్కునగరం, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అమ్మవార్లను దర్శించుకుని తరించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పెదగంట్యాడ: శ్రావణమాసం చివరి శుక్రవారం సందర్భంగా జీవీఎంసీ 76వ వార్డు పరిధి బర్మా కాలనీలోని దుర్గాదేవి ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు చేయించారు.

- హౌసింగ్‌బోర్డు కాలనీలోని వాసవీ కన్యకాపరమేశ్వరీ పంచాయతన దేవాలయంలో ఆలయ కమిటీ ప్రతినిధులు ముమ్మిడిశెట్టి ముత్యాలశెట్టి, కొల్లా అప్పలరాజు, మొగలపల్లి త్రిమూర్తులు, చిట్టూరి వెంకటేశ్వరరావు, పెరుమాళ్ల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కన్యకాపరమేశ్వరి అమ్మవారిని 1100 వందల పసుపు కొమ్ములతో అలంకరించారు. అమ్మవారి అష్టోత్తర శతనామార్చన, సహస్రనామార్చన, సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.



బర్మాకాలనీ దుర్గాదేవి ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు



అగనంపూడి వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి శాంతినగర్ కాలనీలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ అర్చకుడు సత్యనారాయణాచార్యులు ఆధ్వర్యంలో ఆలయ ధర్మకర్త ఈకే చారి దంపతుల పర్యవేక్షణలో కుంకుమ పూజలు నిర్వహించారు. 79వ వార్డు అగనంపూడిలోని జూబిలీహిల్స్ కాలనీలోని ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో కుంకుమ పూజలు నిర్వహించారు.

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం



మాజీ ఎమ్మెల్యే నాగిరెడ్డిని సత్కరిస్తున్న శివగణేశ్వరరావు తదితరులు

పెదగంట్యాడ: ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. అహింస పిరమిడ్ ధ్యానకేంద్రం 15వ వార్షికోత్సవాన్ని ట్రస్ట్ నిర్వాహకుడు మీసాల శివ గణేశ్వరరావు ఆధ్వర్యంలో నెల్లిముక్కులోని జీవీఎంసీ కల్యాణ మండపంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వేడుకలను నాగిరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి బ్రహ్మర్షి పితామహ పత్రీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధ్యానం అంటే శ్వాస మీద ధ్యాస పెట్టడమని చెప్పారు. మనికి ఓర్పు, సహనం రావాలంటే విధిగా ధ్యానం చేయాలని సూచించారు. ఏ విషయంలోనూ తొందరపాటు పనికిరాదని, మనసును అదుపులో పెట్టుకుంటే ఎటువంటి సమస్యలు ఉండవని, అలాగే చెడు ఆలోచనలు రావని వివరించారు. చిన్నారులు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. అనంతరం ట్రస్ట్ ప్రతినిధులు మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పల్లా కార్తీక్, ట్రస్ట్ సభ్యులు వనిత, అప్పలరాజు, నీలకంఠం, దేవిక, ధనలక్ష్మి, గణేష్, పోలిరాజు,భాగ్యగౌరి తదితరులు పాల్గొన్నారు.

వాహనాలు జాగ్రత్తగా నడపాలి

అగనంపూడి: ఇంటి దగ్గర నుంచి బయలుదేరిన మనం తిరిగి విధులు ముగించుకొని భద్రంగా ఇంటికి చేరుకోవాలంటే వాహనాలు జాగ్రత్తగా నడపాల్సిన అవసరం ఉందని దువ్వాడ సినర్జీస్ భద్రతాధికారి ఎల్లాజీరావు అన్నారు. దువ్వాడ సినర్జీస్ క్యాస్టింగ్స్ లిమిటెడ్ ఆవరణలో రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. ఇటీవల రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని, ఈ ప్రమాదాల్లో యువకులే మృత్యువాత పడుతున్నారన్నారు. నిమిషం ఆలస్యం అయినా పర్వాలేదు.. ప్రాణం ముఖ్యమని గుర్తుపెట్టుకుని వాహనాలు నడపాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేనేజర్ సత్య శ్రీనివాస్, వి. శ్రీనివాస్, భద్రతాధికారి కనకమహాలక్ష్మి పాల్గొన్నారు.

టోల్‌గేట్ శాశ్వతంగా తొలగించాలి

అగనంపూడి: అగనంపూడి టోల్‌గేటును శాశ్వతంగా తొలగించాలని.. తలారివానిపాలెం అండర్‌పాస్ వంతెన విస్తరించి భారీ వాహనాలు వెళ్లేందుకు వీలుగా ఏర్పాటు చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్‌మాధవ్‌ను అగనంపూడికి చెందిన వివిధ పార్టీల నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. అలాగే హోమీబాబా ఆస్పత్రిలో స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని నాయకులు బి.సత్యనారాయణ, కె.తాతారావు, ఎ.ఈశ్వరరావు, జి.శంకరరావు, నాగేశ్వరరావు, శ్రీకాంత్, కె.కుమారి కోరారు.

కమిషనర్ దృష్టికి సమస్యలు





జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌కు వినతి పత్రాలు అందజేస్తున్న కార్పొరేటర్లు చందు , గుడివాడ అనూష

గాజువాక: తమ వార్డుల్లో సమస్యలు పరిష్కరించాలని... అభివృద్ధి పనులు చేపట్టాలని జీవీఎంసీ 68,70 వార్డుల కార్పొరేటర్లు గుడివాడ అనూష, ఉరికూటి చందు శుక్రవారం జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌కు వినతి పత్రాలు సమర్పించారు. వార్డులో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను సకాలంలో పూర్తి చేయక పోవడం వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఈ సందర్భంగా కమిషనర్‌కు వివరించారు. ప్రజా అవసరాలను, ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని సంబంధిత పనులను వెంటనే పూర్తి చేయాలని కోరారు.